


**సాంసారిక హాస్యం**

మహా కష్టనిష్ఠురాలతో కూడుకున్న సంసార యాత్రలో అంతా వెన్నెల కాదు; కాని, అంతా చీకటి కాదు. మబ్బులలోనుంచి మెరపుల్లాగ మన ప్రయత్నం లేకుండా కొన్నీ, చేతిదీపాలలాగ మనం తెచ్చిపెట్టుకునేవి కొన్నీ సంఘటనలు మన కళ్లకి వెలుతురూ, మనసుకి సంతోషమూ కలిగిస్తాయి. అల్లా మనం తెచ్చిపెట్టుకునే వాటిలో చెయ్యాలనిచేసే గడుసుతనపు పనులు, ఆడాలని ఆడే చమత్కారపు మాటలూ చేరతవి. అయితే, సాంసారిక జీవితంలో అందరివిషయమై ఇవి ప్రయోగం చెయ్యకూడదు. వావీ, వరసా ఒప్పుకుంటేనే ప్రయోగించాలి. వీలయిన వరుసలలో భార్యాభర్తలది మొట్టమొదటిది. ఆ వరసనుబట్టే శాస్త్రప్రకారం తనకుగల హక్కుల చలామణీలో శ్రీకృష్ణుణ్ణి నెత్తిమీద ఒక్కతన్ను తన్నింది సత్యభామ. భార్యాభర్తల వరసను బట్టే మిగతా వావివరసలు ఏర్పడ్డాయి. భర్తవైపువారు, భార్యవైపువారు ఒకళ్లవిషయంలో ఒకళ్ళు ఎన్ని చమత్కారాలైనా నడిపించుకోవచ్చును. ఎంత హాస్యమైనా చేసుకోవచ్చును. బావా, మరదీ, వదినే మరదలూ వరుసలాడుకోవచ్చును. ఇల్లా వరుసలాడుకునేందుకు వీలయినవాళ్ళలో వియ్యపురాళ్లది ప్రత్యేకస్థానం ... "ఓహో వియ్యపురాలా!" అంటేనే హేళన. వియ్యపురాళ్లు అయినవాళ్లు కొన్ని పనులు చేయాలి; ఒక విధంగా మాట్లాడాలి; సంచరించాలి. అందులో కొంతిదౌర్జన్యం కనబడుతుందిగాని, అందుకు ఎవ్వరూ తప్పుపట్టరు సరిగదా, అల్లా నడుచుకోని, తన వియ్యపురాలితనం చలాయించని వియ్యపురాలు వట్టి ఒద్దమ్మ అనీ, చచ్చుపెద్దమ్మ అనీ అనిపించుకుంటుంది. ఉద్దిలయిన ఇద్దరు వియ్యపురాళ్లు తటస్థపడితే వాళ్ళకు వాదవివాదాలు వచ్చినప్పుడు ఆ ఆటఅయిపోయి, ఫలితం అనిశ్చితం అవుతుంది. కొన్నిసన్ని వేశాలలో గెలుపు నిర్ణయించడం అంతర్జాతీయ న్యాయస్థానానికి విడిచిపెట్టవలసి వుంటుంది. ఈ పోటాపోటీలలో విశేషం ఏమిటంటే, నిజమయినదేదో

తెచ్చిపెట్టుకున్నదేదో నిర్ణయించడం కష్టం. ఆ వివాదంకాస్తా అయిపోగానే పోటీదార్లు ఏం వదినే అంటే ఏం వదినా అని మళ్ళీ కలిసిపోతారు. వెంటనే కలియకపోయినా, మనమడో మనమరాలో పుట్టిన తర్వాత కలిసి తీరుతారు. ఆ నిసుగు ఉభయులకీ ఉమ్మడిసొత్తు కదా!

అల్లా కలుస్తారు కనుకనే, వాళ్లు ఎంత గట్టిగా పోట్లాడుకున్నా ప్రక్కవాళ్లు నవ్వుకుని ఆనందిస్తారు; ఆ వియ్యపురాళ్లూ నవ్వుకుని ఆనందిస్తారు. వియ్యపురాళ్లంటే పాము ముంగిసల్లాగా సహజ విరోధం కనపర్చాలి. నవ్వుతూ, నాజూకుగా ఎత్తిపొడుచుకోవాలి. సూదులలాంటి మాటలు ఉపయోగించుకోవాలి. గొంతెత్తి పోట్లాడుకోవాలి. ముఖం కండలు చీల్చుకొని తిట్టుకోవాలి. వరుసలకి వియ్యపురాళ్లనుకోడం ఎల్లా ఉన్నా, అసలు వియ్యపురాలన్నది వివాహసంబంధం వున్నచోట చెల్లదగిన మాట. వివాహప్రసక్తిలో, అతిముఖ్యమయిన ఘట్టం వియ్యపురాళ్ళది.

సరిఅయిన వివాహానికి మూలం వియ్యపురాండ్రువియ్యపురాండ్రుఅన్న పాత్రలుఉంటేనేగాని, (పెళ్ళిఉంటుందిగాని) వియ్యం ఉండదు; వియ్యంలేకపోతే ఏ వేడుకాఉండదు; ఏవినోదంఉండదు; ఆపెళ్ళి రాణించదు. రెండువైపులా వియ్యంకులు మాత్రం ఉండి జరిగే పెళ్ళి ఉప్పులేని పప్పులాగా చప్పగా ఊరుకుంటుంది. దున్నపోతుల బండిలాగ ఈదురోమంటూ నడుస్తుంది. వియ్యపురాళ్ళు అంటే అటు పెళ్ళికొడుకుతల్లి, ఇటు పెళ్ళికూతురుతల్లీని. కాని వియ్యపురాలు అని ఏకవచన ప్రయోగంచేస్తే పెళ్లికుమారుడితల్లి అని మాత్రం ధ్వని. ఈ రెండు తరగతుల వియ్యపురాళ్ళలో కుడి ఎడమ తేడా ఉన్నది. పెళ్లికొడుకు తల్లి పైచేతి వియ్యపురాలు. పెళ్లికూతురి తల్లిది క్రింది చేయి. లోకవ్యవహారంలో ఇచ్చేవాడికి పుచ్చుకునేవాడు లోకువ. ఇక్కడమాత్రం పిల్లనిచ్చినవారు పుచ్చుకొన్నవారికి లోకువ.

నిజంగా పరిశీలించితే, క్రిందిచేతి వియ్యపురాలు లేనిది వియ్యమే పొసగదు. ఆవిడ

కొన్ని సంవత్సరాలపాటు పోరగా, పోరగా పిల్లతండ్రి సంబంధాలు వెతుకుతాడు. అవి ఆవిడకు నచ్చవు ఆవిడకి నచ్చినవి ఆయన తేడు; నేలేదుకూడాను ఈ విషయంలో పెళ్లికూతురూ, తల్లీ ఒక్కమాట మీద, ఒక్క త్రాటిమీద ఉంటారు. ఆయన తనకు కలిసిన సంబంధమనో, కొస్త కట్నం సులువనో, చేలోకువ కుర్రవాడనో ఆలోచిస్తుంటారు కాబోయే వియ్యపురాలికి సరిగా అవే పనికిమాలిన సంగతులు. పెళ్ళికూతుళ్ళు, తల్లి చెప్పినట్టే అక్షరాలా నడుచుకుంటూ, "నాకేమీ తెలియదు అమ్మ నడుగు నాన్నా," అంటుంది. చివరికి కాబోయే వియ్యపురాలి మాటే నెగ్గుతుంది. వారానికి రెండుమాట్లయినా ఆవిడను హత్యచేసే అంత హంగామా చేసి, తన నెత్తి తానే దబదబా మోదుకొని, ఆవిడ అన్నప్రకారమే చేస్తాడు పిల్లతండ్రి. పెళ్ళికొడుకు వచ్చి, పెళ్ళిపరతులు నచ్చి, పెళ్లిముహూర్తం ఏర్పాటయి, మూడుముళ్లూపడి పెళ్ళితంతు అంతా నడిచి, అప్పగింతలయి, పిల్లా పిల్లవాడూ వెళ్ళిపోయేదాకా ఏమిటి, ఆతర్వాతను పిల్ల పెద్దదయి, కాపురానికి వెళ్ళి తానుకూడా పిల్లలతల్లి అయిన తర్వాతకూడా ఏమిటి, ఈ వియ్యపురాలికి బాధ్యత ఉంటూనే ఉంటుంది. అవతల వియ్యంకుడూ, వియ్యపురాలూ జీవించి ఉన్నంతకాలంమాత్రం వియ్యపురాలనిపించుకుంటుంది. పిమ్మట వియ్యపురాలితనం పోయినా బాధ్యత తప్పదు. ఆమె తనువున్నంతకాలం తప్పనిబాధ్యత అది. ఆవిడకి అంతా బాధ్యతే. హక్కులు తక్కువ. కాని వియ్యపురాలు అంటే పైచేతి వియ్యపురాలనే లెక్క. "వియ్యపురాలి జీళ్ళు" అని ఒకరకం జీళ్ళు అమ్ముతారు. అవి ఆవిడను గౌరవించేందుకు తయారుచేసినవే. వియ్యపురాలి గోటు, వియ్యపురాలి బెట్టు, వియ్యపురాలి అలకా, వియ్యపురాలి గుసుపూ, వియ్యపురాలి దెప్పులూ అన్నీ పైచేతి వియ్యపురాలి విలాసాలు. ఈవిడకి అన్నీ హక్కులేగాని, బాధ్యతలేదు. పెళ్ళి సంబంధం మాటలు, పెండ్లికూతురు చూపులు, వచ్చినప్పుడు ఆమె చేసే జులుము ఏహిట్లరూ చెయ్యలేడు. తనూ, తనకొడుకూ కాకిరంగయినా, బంగారంవంటి పిల్లను పట్టుకుని జీడిగింజలాగ ఉందంటుంది; రంభలాంటి పిల్లకు ముక్కువంకర అంటుంది. అబ్బాయికి సంగీతమంటే ఇష్టం; ఈపిల్లకి సంగీతం రాదంటుంది; ఆపిల్లకి చదువు రాదంటుంది; వియ్యపురాలు వంటమనిషిలా ఉందేమిటే అని ఈసడిస్తుంది. అన్నిహంగులు కుదిరినా, కట్నకానుకలదగ్గర మొండిపట్టు పట్టుకు కూర్చుంటుంది. తనకు రావలసిన లాంఛనాలను గురించి నిష్కర్షచేస్తుంది. ఆరాబడులు అనేక తరగతులు. లాంఛనాలంటారు వాటిని; వియ్యపురాలి లాంఛనాలు. ఈ లాంఛనాలు రొఖ్ఖం రూపంలో ఉంటాయి. నూటపదహార్లు రొఖ్ఖం ఆవిడకు చెల్లించవలసి వుంటుంది. పట్టుచీరెలు, పట్టురవికలు మొదలయిన లాంఛనాలుకూడా ఉన్నవి. వియ్యపురాలికివన్నీ సమర్పించేసి, ఊరుకుంటే చాలదు! మహారాణిని గౌరవించినట్లుగా ఆవిడను గౌరవించాలి. ఆడపెళ్లివారు ఆమెగారిని విడిదిలోనుంచి ఆహ్వానించి, మేళతాళాలతో వెంటపెట్టుకు తీసుకురావాలి. తీసుకువచ్చి, కాళ్లు కడుక్కోను నీళ్ళు తెచ్చి, కాళ్ళు కడిగి తడిఒత్తాలి; ఎత్తైనపీట వేసి కూర్చోపెట్టాలి. ఇందునిమిత్తం వియ్యపురాలిపీటలని ఒకదినుసు పీటలుంటాయి. అటువంటి పీటమీద ఆవిడను కూర్చోపెట్టి, వడ్డనచేయించాలి. వడ్డన ముందుగా ఆవిడికే చెయ్యాలి. ఇందులో ఏది సక్రమంగా నడవకపోయినా, ఆవిడగారికి ఆగ్రహం వచ్చి, సరాసరి విడిదిలోకి వెళ్ళిపోయి భీష్మించుకుని కూర్చుంటుంది. దీనినే వియ్యపురాలి అలక అంటారు. ఆ అలక తీరేదాకా మిగతా పెళ్ళితంతు యావత్తు ఆగిపోవలసిందే! ఆడపెళ్ళివారు పసిపిల్లబాలాది విడిదిలోకివెళ్ళి, ప్రాణాచారాలుపడి, బతిమాలి, అలుకతీర్చి, ఆమెను ప్రసన్నురాలిగా చేయవలసిందేగాని, గత్యంతరం లేదు. ఒకపెళ్ళిలో ఇల్లాగ పైచేతి వియ్యపురాలు పదకొండోమారు అలిగి చక్కాపోయింది. ఆ అలుకకు కారణం లేకపోలేదు. పెళ్ళికూతురుతల్లి అంట్లుతోమే దాసి ఇంకా రాలేదేమని విసుక్కుంటూ ఆదాసి నుద్దేశించి, ఈపెళ్ళి అదనుచూచుకుని, "వెంకమ్మముండకి కళ్ళు నెత్తిమీదికొచ్చాయి," అందిట. పెళ్ళికొడుకు తల్లిగారిపేరు కూడా వెంకమ్మేనట. ఆవిడగారు ఆ తిట్టు తనకే అన్వయించుకుని, విడిదిలోకి లేచి చక్కాపోయింది. "చేసి, చేసి ప్రాణం విసిగిఉండి అల్లాఅన్నాను. మాతల్లీ.. దాసీ దాన్నన్నాను, మిమ్మల్ని అనడానికి నాకు నోరు వొవ్వేందా ? వదినెగారూ నా పిల్లలమీద ఒట్టు !" అని కాళ్లు పట్టుకుంది పెళ్ళికూతురి తల్లి. బంధుజనం కూడా చెప్పిచూచారు; కానీ లాభంలేకపోయింది. చివరికి ఒళ్ళుమండి, "అలిగితే అలగనీ, పొమ్మంది..." పెళ్ళికూతురు తల్లి. వీరింట వీరు, వారింట వారు. అసలు దీనిలో వాస్తవం ఏమిటీ అంటే, వీరూ వారూ లోగడనుంచీ పరిచయస్థులే. పెళ్ళికూతురు తల్లినోరు మహాచెడ్డదని ఆవాడకట్టంతా తెలుసునట. తిట్లాలనే తిట్టి ఉంటుంది అనుకున్నారట విన్నవాళ్లంతా. అసలు అటువైపు వియ్యపురాలేలేని సంబంధం చూడాలనుకుందిట ఆవిడగారు. తన అదృష్టవశాత్తూ తన అత్తామామా త్వరత్వరగానే రాలిపోయినారు; పెత్తనం మొదటినుంచీ తనకేదక్కింది. అల్లాగే తన పిల్లకికూడా, అత్తా ఆడబిడ్డలు లేని సంబంధం బాగాఉంటుందని ఆవిడ ఎన్ని మొక్కులో మొక్కుకుందట. అయినా, ఈ సంబంధం నసిపడి ఊరుకుంది. నాపోలికే వచ్చి నాపిల్లకి కూడా అత్తగారి అడ్డంకి తీరిపోకపోతుందా అన్న ధైర్యంకొద్దీ, సంబంధానికి ఒప్పుకుందిట. "ఈ వియ్యపురాలు ఇంకా చావకుండా, బతికివుండడమే కాకుండా, మాటిమాటికీ అలకలుకూడా ఏమిటె!" అని కంటగించుకుంటూంది పెళ్ళికూతురి తల్లి అని ఒకపుకారు వేశారు. ఆవిడగారిభర్త అర్భకుడు. అంటే, కన్యాదాత తనకిష్టమయినమాట ఎవరు చెప్పినా వినుకు నేరకం. తన భార్యమాటకు ఎదురు చెపితే, తనపని ఏమవుతుందో అనుభవంవల్ల ఎరిగేఉన్నవాడు కాబట్టి, తనవియ్యపురాలి అలుక తీర్చేవిషయమై ఎటువంటి ప్రయత్నాలు పెట్టుకోక తాలూకా ఆఫీసులో పని ఉన్నదని అవతలకు చక్కాపోయినాడు. మగపెళ్లివారు ఆరోజు రోజంతా కటిక ఉపవాసంఉండి, ఆపెళ్లి పట్నవాసంలో జరగడంవల్ల ఏదో హోటలునుంచి అర్థరాత్రివేళ ఇంత టిఫిను తెప్పించుకుని తిన్నారు. మర్నాడు ఉభయపక్షాలవారూ శాంతించి, రాజీపడి పెళ్లికాస్తా పూర్తిఅయిందనిపించారు. ఆపెళ్లిఅయిన కొద్దికాలానికే, పెళ్లికొడుకుతల్లి గతించిందని తెలుస్తుంది. పెళ్లికూతురు తల్లికోర్కె ఫలించింది.

పైచేతి వియ్యపురాలికి ముఖం కడిగించడం అనేవేడుక ఒకటి ఉన్నది. తెల్లవారగానే కచ్చికా, తాటాకూ, నీళ్ళూ తీసుకువెళ్లి ఆమెను దంతధావనం చేయించాలి. ఆపెళ్ళివారు. అందుకు తగిన పాటలుకూడా పాడతారు. ముత్తయిదువులు పాడే ఆపాటలలో సారాంశం వియ్యపురాలికి పళ్లు తోమాలిట. పల్లేరుపుల్లతో పళ్లుతోమాలి! పళ్లు చల్లగ తోమాలీ నల్లగ తోమాలీ...

పెళ్ళి జరిగినంతకాలం ఆవిడగారిని ఏమీ అనలేక ఆవిడమీదఉన్న కక్ష ఆవిధంగా తీర్చుకుంటారని తోస్తుంది. పల్లేరుపుల్లతో కన్న ఈతముల్లతో తోమితే కొంత ఉపశమనమేమో. ఒకానొక వివాహసందర్భంలో ఏంజరిగిందంటే; పెళ్ళికొడుకు తల్లి వయస్సులో నేఉన్నా, దంతపటుత్వం మాత్రం తప్పి, కొన్నిపళ్లు వాటంతటఅవే ఊడిపోతే, మిగతవి ఆవిడ ఊడపీకించుకుని, ఏకంగా అన్నీ కొత్తపళ్లు పెట్టించుకుందిట. ఆరహస్యం బయటపడకుండా ఆవిడ మొఖాలు కడిగించడం తంతు మానెయ్య

# ★ వియ్యపురాళ్లు ★

మందిటగాని, అవతలివాళ్ళు వినలేదు. ఎంత సేపటికీ ఆవిడ కలిసిరాకపోతే, ఆవిడకేదో అలకవచ్చిందని ఏమీ తోచనిస్థితిలో వున్నంతల్లో, వియ్యపురాలికి దగ్గ తెఱ వచ్చి, పెట్టుడుపళ్ళ చట్రంచట్రం ఊడిపడిందట! ఆడపెళ్ళివారి ముత్తయిదువ అదివరకున్న పాటలో కలిపి, "బోసినోటి వియ్యపురాలికి పళ్ళుతోమండీ! పెట్టుడుపళ్ళ వియ్యపురాలికి పళ్ళుతోమండీ!" అని ఆశుకవిత్వం చెప్పిందట. ఆ బోసినోటి వియ్యపురాలికి నిజంగానే అలకవచ్చిందిట... పైచేతి వియ్యపురాలు, లేక మేలిరకం వియ్యపురాలు అన్నది ఒక తరగతి మాత్రమే. ఇందులో అనేక విభాగాలున్నవి. పెండ్లికొడుకు పెంపుడుగున్న అయితే, అతని పెంపుడుతల్లీ వియ్యపురాలే, జనకతల్లీ వియ్యపురాలే. సవతితల్లి ఇంకొక రకం వియ్యపురాలు. పెండ్లికొడుకు పెత్తల్లి, పినతల్లులూ వియ్యపురాళ్లే. అతని పెత్తండ్రుల, పినతండ్రుల భార్యలూ వియ్యపురాళ్ళే. అసలు వియ్యపురాలిదే ననుకోండి అగ్రస్థానం...వియ్యంకుడు ఎన్నడో గతించి ఉన్న సందర్భంలో విధవవియ్యపురాలు ప్రాప్తమవుతుంది. వితంతువు వియ్యపురాలయితే, లాంఛనాలు రవ్వంత భేదిస్తాయి. రొఖ్ఖం రొఖ్ఖమేననుకోండి. చీరలు, రవికెలు బదులు పంచెలు, జామార్లు ఉంటాయి. పసుపులూ, పారాణీ, కుంకుమ, గంధం ఉండవు. ఆవిడ నలుగురిలోకీ రాదు. తెరచాటున ఉండి గ్రంథం నడిపిస్తుంది. పెళ్ళిళ్లలో ఉదయమే మగపెళ్ళివారికి ఫలహారాలు పంపించవలసిన బాధ్యత ఆడపెళ్ళివారికున్నది. ఒకపెళ్లిలో కాఫీ, ఉప్మా పంపించేసరికి, వియ్యపురాలు "మడీ, ఆచారం వున్నవాళ్ళకి ఉప్మా లేమిటి? మమ్మల్ని ఎగతాళిచేస్తున్నారు!" అని బిర్రబిగుసుకుపోయిందిట! "మీకు కాదండీ! మిగతావాళ్ళకండీ," అంటే విని, "ఉప్మా వద్దన్నానుగాని, నాకుమాత్రం వేడుకలు లేవా ఏమిటి? నేను తినేవస్తువే తేవాలని ఎందుకు తోచలేదు?" అని వాదనలోకి దిగిందిట. అప్పుడు మడిగా, ఇంత చలిమిడి ముద్దా, పానకమూ, ఇంత ఉప్పుడుపిండీ తయారుచేయించి పంపించారుట! రోజూ సాయంత్రం మినపరొట్టే, చేగోడీలు, అటుకులు మొదలైన మడిఫలహారాలు పంపించేవారట.

కొన్ని కుటుంబాలలో వియ్యంకుడు పేరుమట్టుకు ఉంటాడు; పెత్తనమంతా భార్యగారిదే! ఆయన మితభాషిగా ఉంటాడు; అతిసాధువుగా ఉంటాడు. ఆయన జోక్యం ఏ విషయంలోనూ కలిగించుకోడు. ఆవిడ కలిగించుకోనివ్వదు. అటువంటి పైచేతి వియ్యపురాలు తటస్థిస్తే మీ పిల్లకి పెళ్ళిచెయ్యడం మానేసి ఊరుకోవడం ఉత్తమం. ఆపైని మీ ఇష్టం.


పైచేతి వియ్యపురాలు ఆడపెళ్లివారిని అనేకవిధాల వేధించడమే కాకుండా, పైపెచ్చు వెక్కిరిస్తుంది; వియ్యాలవారి పాటలు పాడిస్తుంది. వియ్యాలవారి విందు చందము తెలిపితే, అందరికీ ఆనందమువునవునట! కూరే వంకాయకూర, వేరే మరేమి లేదట! అదీ ఉప్పు తక్కువయి, ఉడుకు తక్కువయి, నీళ్లు కారుతూ ఉంటుందిట! అదే పిసుక్కుని తిందామంటే మారు వడ్డించరట! "అప్పడాలు, వడియాలు అసలే లేవండీ!" అని ఆశ్చర్యపోతుంది ఆపాటకత్తె. తమలపాకులయినాను ఇప్పించుతారంటే, ఆకు ఉన్నదిగాని పోక లేదు. ఆకూ పోకా ఉన్నా అది కుళ్లుదీ ఇది పుచ్చుదీ... దీనికంతకు కారణం, ఆ ఎడ్డె, మడ్డి చికిలికళ్ల చింపిరిజుట్టు, గయ్యాళిగడ్డతె పిసినారి, పేకులాట వియ్యపురాలు!

ఇవతల ఆడపెళ్లివారు కూడా మరీ పడివుండరు...వియ్యాలవారి పాటలు అటూ, ఇటూ కూడా వున్నాయి! వాళ్ళవైపు పాటకత్తె పెండ్లికుమారుణ్ని వర్ణిస్తుంది; అతడు గూనివాడు, గ్రుడ్డివాడు, కుంటివాడు, కురూపి, చదువులేదు, సంధ్యరాదు, అంటూ చెప్పి చెప్పి, "సుదతిరో ఈ పెండ్లికొడుకు శుద్ధ వెఱ్ఱివాడు!" అని తేలుస్తారు. ఆడబిడ్డలను, ఆడబడుచు పాటలలో అనేకరకాలుగా వెక్కిరిస్తారు. అటువంటి కొడుకుని ఇటువంటి ఆడబిడ్డలనుకన్న ఆ వియ్యపురాలు ఎటువంటిదయ్యా అంటే, వట్టికోని మనిషి; పేచీకోరు, మగవాళ్ల లక్ష్యం లేని మనిషని వర్ణిస్తారు. చాటుగా, పొగచుట్టలు కాలుస్తుందనికూడా చెపుతారు ... ఆవిడకి చిల్లుల అప్పడాలు వడ్డిస్తారు! రకరకాల గుడ్డపీలికలతో చేర్చికుట్టిన రవిక ఆమెకు బహుమానం ఇస్తారు. పచ్చిగడ్డి, తవుడు మొదలయిన వస్తువులు కానరాకుండా పచ్చని పులుసులో కలిపి ఆవిడచేత తినిపిస్తారు! తమలపాకుల చుట్టలలో గులకరాళ్లూ, పచ్చిమిరపకాయలూ, ఉల్లిపాయముక్కలూ పెట్టి నమిలిస్తారు. గంధం రాస్తూ, రాస్తూ ఆమె చెంపలమీద ఒకటి వేస్తారు. అవతల పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఎన్ని సరసాలాడుకుంటారో ఇరువైపుల వియ్యపురాళ్లూ అన్ని సరసాలూ ఆడుకుంటారు.

ఈ వియ్యపురాలి జులుము పెళ్లితో ఆగిపోతుందా? వెనకటి రోజులలో పెళ్ళి అయిన తర్వాత, పిల్ల పెద్దదయిందన్నప్పుడు, పునస్సంధానసమయంలోను, పిల్లని కాపురానికి తీసుకువెళ్ళే తరుణంలోనూ, ఎప్పుడయినా పుట్టింటికి పంపించడం సందర్భంలోను పైచేతి వియ్యపురాలు తన హోదా చలాయిస్తూనే ఉండేది. తాను బ్రతికి ఉన్నన్నాళ్లూ తన అధికారం రవ్వంత కూడా వెసగనిచ్చేది కాదు; కోడలి పుట్టింటివారిని ఇటు అటు మెసలనిచ్చేది కాదు.

ఇతర దేశాలవిషయం నాకు తెలియదు. విన్నంతలో పశ్చిమ ఖండాలలో వియ్యపురాళ్ల జోక్యం ఇంత ఉండదేమో అనుకుంటాను. అక్కడ బాధల్లా అత్తగారితోనే. లార్డ్ బైరన్ తాను ఆత్మహత్య చేసుకుందామనుకుని అందువల్ల తన అత్తగారికి ఆనందం కలుగుతుందికనుక మానుకున్నట్టు చెప్పుకున్నాడు.

మనదేశ చరిత్రలో కొంత పరిశోధన చేసినవారు చెప్పగా విన్నాను. ఈ వియ్యపురాళ్ల తంతు ఇటీవలదేనని. శ్రీరాములవారి వివాహంలో వియ్యపురాళ్లు ఏ బెట్టుసరీ చెయ్యలేదు. మీ పిల్లవాళ్లకి పిల్లలనిస్తాము రండీ అని జనక మహారాజు మనిషిని పంపితే, రాణులతోటీ రాణువలతోటీ తరలి చక్కా వచ్చాడు, దశరథ మహారాజు. వచ్చి అయినా

SEENU & CO., GRAMS ORCAS' (ESTD 1940) PHONE 55357 28, THANDAVARAYA GRAMANI STREET, MADRAS-21.

సుముహూర్తం సమీపిస్తుంది కౌబోలు ముమ్మల్లను రమ్మన్నారా అని విడిదినుంచి తానే వేడుకుంటాడు. ఒకరకొదు, మగుడు వియ్యపురాళ్ళు పల్లెత్తి మాట్లాడలేదు. రుక్మిణీ శ్రీకృష్ణుల వివాహంలోనూ, శకుంతలా దుష్యంతుల వివాహంలోనూ వియ్యపురాండ్ర మాటేలేదు. ద్రౌపదీ వివాహంలో కుంతీ మహాదేవి ఎంతమాత్రం తీవి చూపలేదు. రుక్మిణీ శ్రీకృష్ణుల వివాహం రాక్షస వివాహంగనుక శకుంతలా దుష్యంతుల వివాహం గాంధర్వవివాహం కనుక, సీతా ద్రౌపదీదేవుల వివాహాలు స్వయంవరాలు గనుకా వియ్యపురాళ్ల జోలి లేదను కుందాము. కాని ఇరువైపులా ఉండవలసిన బలగమంతా ఉండి జరిపించిన ఉత్తరాభిమన్యుల వివాహంలో విరాటరాజు, యాజ్ఞసేనీ, సుభద్రలు కనురూపాభరణ పరిధానంబులు మాత్రం పంపించినట్లు కనబడుతుంది. కాని ఒక్కమాటయినా ద్రౌపది సుభద్రా అలిగినట్లు కనబడదు తాను పైచేతి వియ్యపురాలైనందుకు సుభేష్ణవిషయంలో ద్రౌపది ఎంత కసితీర్చుకోవలసి ఉన్నది!

ప్రస్తుతకాలంలో మనలో కూడా వియ్యపురాళ్ల సంస్థ నశించే సూచనలు కనబడుతున్నాయి. చిన్నవయస్సులో ఉన్న పిల్లలకు పెళ్ళిళ్లు చేసేటప్పుడు, ఆ పెళ్ళి అయిదురోజులు చేసేటప్పుడు ఆ అయిదు రోజుల్లూ పెద్దవాళ్లి వేడుకలకోసం ఏర్పాటయిన ఆచారాలు ఇప్పుడు అమలులో నుంచి పోతున్నాయి. స్వయంవరాలు బలిసిపోతున్నాయి. వియ్యంకులు వియ్యపురాళ్ళకన్న ముందు వధూవరులే అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెళ్లిళ్ళు ఒక్కరోజో, ఒక్కపూటో అటూ ఇటూ తల్లిదండ్రులు రాకుండాకూడా జరిగిపోతున్నాయి. కొన్ని పెళ్లిళ్లు రిజిష్ట్రారు కచేరీలో జరుగుతున్నాయి. వయస్సు ముదిరిన వధూవరులకు, వియ్యంపొందవలసిన ఈడున పెళ్లిళ్లు జరుగుతున్నాయి. అట్టి స్థితిలో వియ్యపురాళ్లూ లేరు; వేడుకలూ ఉండవు. రిజస్ట్రేషను పెళ్లిళ్లలో రిజిష్ట్రారుగారిమీద పన్నీరుచల్లి, బంట్రోతుకు గంధం పూయాలి. కొంత 'రుసుము' చెల్లిస్తే ఒప్పుకుంటారు, సందేహం లేదు.

—విజయవాడ రేడియో సౌజన్యంతో.]

★



# మీ ఉద్యోగమేమి?


వ్యాపారియా, సామానుసామానులు తయారు చేయు వారా...ఎలెక్ట్రిషియనా., మెకానిక్కా...హాబీయిస్టా?

అయితే మీ కత్యవసరమైనది 'ఉల్ఫుకబ్బు'—దృఢమైన, శక్తివంతమైన, ఇంతకు ముందు ఎన్నడు లభించని మీ శక్తికి తగిన ఖరీదులో దొరకుచున్నది. ఎలెక్ట్రిక్ డ్రిల్లు.

'ఉల్ఫుకబ్బు' డ్రిల్లుతో ప్రారంభించి మీ కర్మాగారమును ఇతర విద్యుచ్ఛక్తిచే పనిచేయు పనిముట్లతో నింపుడు.

'ఉల్ఫుకబ్బు.' డ్రిల్లింగ్, పాలిషింగ్, సాయింగ్, మరియు వేరి పనిముట్లతో చేయుట వలన కలుగు అలసట, ఇబ్బందులు లేక చేయుచున్నది. అది బహువ్యాపకమైనది, తేలికైనది మరియు ఉపయోగించుటకు సులభమైనది. మీరు తక్కువ శ్రమతో ఎక్కువ ఫలము పొందగలరు.



రాలీస్ ఇండియా లిమిటెడ్.
320, లింగిచెట్టి స్ట్రీట్, మదరాసు. బొంబాయి • కలకత్తా • ఢిల్లీ.